## క్లుప్తంగా

### ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

**బూర్గంపాడు:** హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచారు. విద్యార్థులు ఎస్కే అఫీఫా, పీఏఎస్ ఉజ్జయిని, టి.భవ్యశ్రీ, బి.హర్షిత, వి.సాయి సంతోషి, బి.భవ్య, ఎం. సాత్విక, బి. సాయి నాథ్ మ్యాథ్స్, సైన్స్ విభాగాల్లో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధ వారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

### పునర్వసు కల్యాణం

**దుమ్ముగూడెం:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా బుధవారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా పలు పూజా కార్యక్రమాలు చేపట్టి కల్యాణతంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, తాత్కాలిక పరిచారకులు భరత్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

### పనులు పూర్తి చేయాలి

**చండ్రుగొండ:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన పనులను పూర్తి చేయాలని జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి కోరారు. మండలకేంద్రం చండ్రుగొండలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మంజూరు చేసిన నిధులను వెచ్చించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పంచాయతీ తీర్మానాలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, లంకా విజయలక్ష్మి, నల్లమోతు వెంకటనారాయణ, ఉన్నం నాగరాజు, మల్లేష్, రామరాజు పాల్గొన్నారు.

### నేతకానిలను గుర్తించాలి

**కరకగూడెం:** పాలకులు మారుతున్నా, కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతున్నా నేతకాని కులస్తులను గుర్తించకపోవడం బాధాకరమని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని తాటిగూడెం గ్రామంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్లో తెలంగాణ ఉద్యమకారుడు, ఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోగు సుధాకర్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. సమావేశంలో సందీప్, సురేందర్, గణేష్ పాల్గొన్నారు.

### ఓపెన్‌జిమ్‌ను సద్వినియోగం చేసుకోండి

**మణుగూరుటౌన్:** సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులను ఆహ్లాదపరుస్తూ మణుగూరు మణిహారంగా మారిన బీఆర్ అంబేడ్కర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సూచించారు. బుధవారం పీవీకాలనీలోని పార్క్‌లో రూ.5లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కూడిన జిమ్‌ను ప్రారంభించిన జీఎం మాట్లాడుతూ.. ఆధునిక సదుపాయాలు కలిగిన పుల్ చైర్, ఆటమ్ స్వింగ్, రోయింగ్ మెషిన్, ఏయిర్ వాల్కర్, ఎల్లిప్టికల్ ఎక్సర్‌సైజర్, లెగ్ ప్రెస్, సీటెడ్ చెస్ట్ ప్రెస్, సిట్టింగ్ అండ్ స్టాండింగ్ ట్విస్టర్ వంటి పరికరాలను కార్మికులకు అందుబాటులో ఉంచామన్నారు. అధికారులు వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, సలగల రమేష్, వెంకట్రావు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణం రాజు, జాన్‌వెస్లీ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

### అంబులెన్స్ అందుబాటులో ఉంచాలి

**మణుగూరురూరల్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ఏరియా ఆస్పత్రి అంబులెన్స్‌ను 24గంటల పాటు అందుబాటులో ఉంచాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, గట్టయ్య, రాములు, ముత్తేశ్వర్‌రావు, శబ్బుద్దీన్, శ్రీనివాస్, రామకృష్ణ, కుమారస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు ఆహ్వానం

**దమ్మపేట:** మండలంలోని సుధాపల్లి గ్రామంలో వెంచేసియున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. బుధవారం మండలంలోని గండుగుపల్లి గ్రామంలోని నివాసంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసిన ఆలయ కమిటీ సభ్యులు.. వార్షికోత్సవ క్యాలెండరును, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరింపజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మినీ మేడారం జాతర

- గద్దెకు చేరిన సారలమ్మ
- భక్తులతో కిక్కిరిసిన తోగ్గూడెం ఆలయం



భక్తులతో పోటెత్తిన ఆలయ ప్రాంగణం



సారలమ్మ తల్లిని గద్దెకు తీసుకొస్తున్న పూజారులు



వనదేవతలను దర్శించుకున్న ఏరియా జీఎం రామచందర్

**మణుగూరురూరల్:** మండలంలోని తోగ్గూడెంలో సమ్మక్క–సారలమ్మ దేవాలయం(మినీ మేడారం)లో బుధవారం నుంచి జాతర వైభవంగా ప్రారంభమైంది. మండమెలుగుటతో ప్రారంభమైన జాతర వనదేవతల గద్దెకు చేరి తిరిగి వనప్రవేశంతో ముగుస్తుంది. తొలిరోజు బుధవారం సారలమ్మ తల్లిని ఆదివాసీ పూజారులు, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు మేళాతాళాలు, డప్పు వాయిద్యాలు, కోయ నృత్యాల నడుమ సారలమ్మ తల్లిని ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గద్దెపైకి చేర్చారు. సారలమ్మ తల్లి గద్దెకు వస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో జాతర ప్రాంగణమంతా కిక్కిరిసింది. అమ్మవారు గద్దెకు చేరడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని తోడ్కొని వచ్చేటప్పుడు ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా మణుగూరు సీఐ సతీష్‌కుమార్ స్పెషల్ పార్టీ సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ నిర్వహించారు. జాతర సందర్భంగా మణుగూరు ఏరియా సింగరేణి జీఎం దుర్గం రామచందర్, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి వనదేవతలను దర్శించుకుని పూజలు చేశారు. తొలత ఆలయానికి విచ్చేసిన జీఎం రామచందర్, తహసీల్దార్‌లకు ఆలయ కమిటి సభ్యులు సాదర స్వాగతం పలికారు. భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు.

**ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు**

మండలంలోని తోగ్గూడెంలో జరిగే మినీ మేడారం జాతర సందర్భంగా సీఐ ఎస్.సతీష్ కుమార్ నేతృత్వంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు గట్టి బందోబస్త్ నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు తరలివెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భారీ వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు తోగ్గూడెం, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. సీఐ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్సై రాజేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్న సీఐ సతీష్‌కుమార్

**మజ్జిగ పంపిణీ**

తోగ్గూడెం మినీ మేడారానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సీఐ సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు.ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్న అయ్యప్పదీక్ష సమితి వారికి ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు తనుగుల శ్రీను, సింహాద్రి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సెంట్రల్' పనులకు రంగం సిద్ధం



రోడ్లకు ఇరువైపులా నిర్మాణాల తొలగింపుపై ములకలపల్లిలో సమావేశం..

**ములకలపల్లి:** మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. త్వరలో పనులు ప్రారంభం కానుండంతో రోడ్డుకిరువులా 50 అడుగుల పరిధిలోని ఆక్రమణలు తొలగించాలంటూ ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారులు మౌఖిక ఆదేశాలు చేశారు. ములకలపల్లిలో 1.2 కిలోమీటర్లమేర సెంట్రల్ లైటింగ్, డివైడర్, ఫోర్ లైన్ బీటీ రోడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ 5.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నాటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గత ఆగస్టు మాసంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. దీంతో ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డుకిరువైపులా 50 అడుగుల దూరం కొలతలు వేసి, మార్కింగ్ వేశారు. నిర్మాణాలు తొలగించాలని యజమానులకు తెలిపారు. ఎన్నికలకోడ్ రావడంతో పనులు ఆరంభించలేదు.

ఇదిలా ఉండగా రోడ్డుకిరువైపులా 33 కే.వీ. 11 కే.వీ విద్యుత్ లైన్లు ఉండడంతో వాటి షిఫ్టింగ్‌కు నిధులు మంజూరు కోరుతూ ఆర్‌అండ్‌బీ అధికారులకు నివేదిక పంపారు. ఇటీవల నిధులు మంజూరయ్యాయి. డ్రెయినేజీతోపాటు మరో 800 మీటర్ల ఫోర్‌లైన్ బీటీ నిర్మాణానికి కూడా నివేదిక పంపగా, నిధులు మంజూరైనట్లు సమాచారం. ఇక విద్యుత్ లైన్ల మార్పిడి పనులు మొదలుపెట్టాల్సి ఉంది. ఈతరుణంలో 50 అడుగుల మార్కింగ్ లోపల నిర్మాణాలను తొలగించాలంటూ రెండు రోజుల క్రితం సంబంధిత శాఖ అధికారులు భూయజమానులకు సమాచారం ఇచ్చారు. దీంతో సెంట్రల్ లైటింగ్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.

**50కి సమ్మతమే (నా) ..**

రోడ్డు కిరువైపులా 50 అడుగుల పరిధిలోని నిర్మాణాల తొలగింపుపై అయోమయం నెలకొంది. ఈ తరుణంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ ఉపసర్పంచ్ శనగపాటి అంజి పుర ప్రముఖలు పువ్వాల మంగపతి, పర్వతనేని అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, గాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోపి, శ్రీరాముల నాగేశ్వరారావు, పద్దం బుజ్జి, బిక్కుమళ్ల సుదాకర్‌లతోపాటు గృహ యజమానులు. స్థానిక వ్యాపారులు పాల్గొని, అభిప్రాయాలను వెలిబుచ్చారు. యాభై అడుగులమేర నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించి, అభివృద్ధికి సహకరించాలని అధికమంది సూచించారు. అ విషయంలో దాదాపుగా ఏకాభిప్రాయన్ని ప్రకటించారు. అయితే కొందరు మాత్రం కొంతమేర మినహాయింపు ఇచ్చి 40 నుండి 45 అడుగులకు పరిమితం చేయాలని విన్నవించారు. స్థానిక పరిస్థితులను గమనించి చిరువ్యాపారులకు. గృహస్తులకు న్యాయం చేయాలని, తమ అభ్యర్ధనను మన్నించి కొంతైనా మినహాయింపు ఇవ్వాలని వారు సమావేశంలో కోరారు.

**మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం: ఏఈ**

మరోవైపు, రెండు మూడు రోజుల్లో పనులు మొదలుపెడతామని ఆర్‌అండ్‌బీ ఏఈ లక్మానాయక్ సాక్షికి తెలిపారు. మొదట కల్వర్టు నిర్మాణం ఆరంభించి 50 అడుగులలోపు నిర్మాణాలు తొలగించాలని యజమానులను ఇప్పటికే సమాచారం అందించినట్లు తెలిపారు. అందరి సహకారంతో పనులు పూర్తి చేస్తామన్నారు.

## ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు

**చర్ల:** ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు సీవిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో క్రీడా పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ కామండెంట్ రితీష్ ఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ ఆధ్వర్యంలో రన్నింగ్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో విద్యార్థులు క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మెమొంటోలతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమానుల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెకెంట్ ఇన్ కమాండెంట్ సి.ప్రీతి, అసిస్టెంట్ కమాండెంట్, రాజ్‌కుమార్, చర్ల సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి, రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం ప్రిన్సిపాల్ వర్మ, సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సీఆర్‌పీఎఫ్ అధికారులు, సివిల్ పోలీసులు

## అన్నదానం అభినందనీయం



అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి

**మణుగూరుటౌన్:** ప్రతీ రెండు సంవత్సరాలకోసారి జరిగే మేడారాన్ని పురస్కరించుకుని మినీ మేడారం వద్ద మణుగూరు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఉచిత అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని తహసీల్దార్ రాఘవరెడ్డి, ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌లు అన్నారు. బుధవారం జాతర తొలిరోజు కావడంతో ఆయా సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తుల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య, వాసవీక్లబ్, వాసవీ వనితా క్లబ్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ గుమ్మడివెల్లి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం డిస్ట్రిక్ గవర్నర్ చారుగుండ్ల శ్రీనివాసరావు, దారా మల్లికార్జునరావు, దారా నర్సింహారావు, మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై రాజేశ్, దోసపాటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేశ్ వాసవీక్లబ్ ప్రతినిధులు బండారు నర్సింహారావు, విశ్వనాథగుప్తా, చిట్టూరి శేషుకుమార్, చిత్తలూరి రమేష్, రాము, బ్రహ్మయ్య, కేసా రాజేంద్ర ప్రసాద్, బొగ్గవరపు అంజలి, సింగరేణి అధికారులు తదితరులు ఉన్నారు.

### దారులన్నీ మేడారం వైపునకే..

**బూర్గంపాడు:** మేడారంలోని సమ్మక్క సారలమ్మ జాతరకు మండలం నుంచి వేలాది మంది భక్తులు తరలివెళ్తున్నారు. గత మూడు రోజులుగా ట్రాక్టర్లు, ఆటోలు, మిని వ్యాన్లు, ఆర్టీసీ బస్సులలో వేలాదిమంది జాతరకు బయలుదేరారు. బుధ, గురువారాలలో నిండు జాతర ఉండటంతో బుధవారం తెల్లవారు జాము నుంచి వందలాది వాహనాలలో భక్తులు మేడారంకు పయనమయ్యారు. గ్రామాలలో జనాలంతా మేడారం వెళ్లటంతో గ్రామాలలో జనసంచారం తగ్గింది.

### రెవెన్యూ అధికారుల సర్వే

**చండ్రుగొండ:** మండలకేంద్రం చండ్రుగొండలోని అంబేద్కర్‌నగర్‌లో శ్మశానవాటికకు దారి ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు బుధవారం సర్వే చేశారు. శ్మశానవాటికకు దారి లేక పోవడంతో వర్షాకాలం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిలో కాలనీకి చెందిన యువకులు ఇటీవల ఫిర్యాదు చేశారు. సీఎం పేషీ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ఇరువైపులా ఉన్న భూముల యజమానులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అక్బర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు ధర్మరాజు, యాకుబ్‌బీ పాల్గొన్నారు.

### ఎర్రబోడులో వైద్యశిబిరం

**చండ్రుగొండ:** మండలంలోని బెండాలపాడు గ్రామశివారు ఎర్రబోడులో చండ్రుగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గొత్తికోయ ఆదివాసీలకు డాక్టర్ హెచ్ వెంకట్‌ప్రకాష్, డాక్టర్ కనకం తనుజలు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గొత్తికోయలకు సూచించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది యండి.ఇమాం, పద్మ, వి.సుజాత, శ్రీనివాస్, ఆశవర్కర్లు రాజేశ్వరి, నాగమణి, విజయకుమారి పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సున్నం సమ్మయ్య

**దుమ్ముగూడెం:** పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో 10/10 మార్కులు సాధించాలని ఎంఈఓ సున్నం సమ్మయ్య అన్నారు. బుధవారం దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఏవీ రామారావు అధ్యక్షతన వీడ్కోలు సమావేశం జరిగింది, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాబోవు రోజుల్లో మరికొంత మంది విద్యార్థులు పాఠశాలలో చేరే విధంగా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ ఏజే ప్రభాకర్, గ్రామపెద్దలు కొత్తూరి సీతారామారావు, యలమంచి శ్రీనుబాబు, బైరెడ్డి సతీష్, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు షేక్ హుస్సేన్ అహ్మద్, సరిత, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతో పోరాటాలు చేయాలి

**అశ్వారావుపేటరూరల్:** విప్లవ పార్టీల ఐక్యతతో పోరాటాలకు సిద్ధం కావాలని, పోరాటాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దురదపాడు గ్రామంలో అరుణోదయ సంఘం క్యాంపు శిక్షణను జెండా ఎగుర వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 3వ తేది నుంచి జరిగే విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను విజయవంతం చేసేందుకు అరుణోదయ సాంస్కృతి సమాఖ్య ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. ప్రజా సమస్యలు, విప్లవ పార్టీల పోరాటాలు, ప్రభుత్వాల నిరంకుశ పాలనను ప్రజల్లో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కంగాల కల్లయ్య, నూపా భాస్కర్, మాజీ సర్పంచ్‌లు కుంజా లక్ష్మి, కంగాల భూలక్ష్మి, నాయకులు పండా ముత్యాలు, బాడిస లక్ష్మణ్‌రావు, పాయం పోతురాజు, గంగరాజు, మంగరాజు, వీరప్ప, రాము, జయమ్మ, లాలమ్మ పాల్గొన్నారు.



అరుణోదయ సమాఖ్య జెండాను ఎగుర వేస్తున్న నాయకులు

## బాలికకు ఉచిత వైద్యం అందిస్తా..

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని కుడుములపాడు గ్రామానికి చెందిన ఏడేళ్ల వయస్సుగల గిరిజన బాలిక మీనాక్షి ఈ ఏడాది జనవరి 10వ తేదీన ప్రమాదవశాత్తు చలి మంటల్లో పడి శరీరం పూర్తిగా కాలిపోయింది. తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో ఖరీదైన వైద్యాన్ని అందించలేక ఇంటి వద్దే ఉంచి అరకొర వైద్యం అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుధవారం బాధిత బాలిక నివాసానికి వెళ్లి పరామర్శించి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు తక్షణమే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి ఖమ్మం ఆస్పత్రికు పంపించారు. ఆస్పత్రిలో పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందిస్తానని, బాధిత కుటుంబానికి సొంత ఇల్లు కుడా లేక పోవడాన్ని గమనించి ప్రభుత్వం నుంచి త్వరలోనే ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్ ఉన్నారు.

**వితరణ నగదు అందజేత**

బాధిత బాలిక వైద్యానికి అశ్వారావుపేట మండలానికి చెందిన పలువురు దాతలు నగదును వితరణగా అందించారు. స్థానిక వర్తక సంఘం ఉపాధ్యక్షులు సంకురాత్రి సతీష్ ఆధ్వర్యంలో దాతల వద్ద నుంచి సేకరించిన రూ.32వేలతోపాటు, ఎమ్మెల్యే సొంతంగా రూ.10వేలు కలిపి మొత్తం రూ42వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు.

## ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**అన్నపురెడ్డిపల్లి:** జిల్లాలోనే ప్రముఖ ఆలయాలుగా పేరుగాంచిన అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి, బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వచ్చే నెలలో జరిగే ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం స్థానిక శివాలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉత్సవాలపై గ్రామస్తులు, భక్తుల నుంచి పలు సూచనలు స్వీకరించారు. ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవ కమిటీ ద్వారా స్వామి వార్ల ఉత్సవాలను వైభవంగా జరిగే విధంగా చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఉత్సవాలకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అన్నపురెడ్డిపల్లి మండల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలిత ఆయన ఆలయంలో స్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబ్నా, విద్యుత్ శాఖ ఏఈ తరుణ్, మండల వైద్యాధికారిణి ప్రియాంక, ఆలయ మేనేజర్ రమణ, నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వర్లు, వేముల రమణ, దోసపాటి రాంబాబు, మామిళ్లపల్లి లక్ష్మణరావు, రాము, రాఘవులు, రాంబాబు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటరూరల్:** ఇంటర్ విద్య విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వంటిదని, విద్యార్థులు విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కళాశాల అభివృద్ధి కోసం రూ.20వేల నగదును ఎమ్మెల్యే వితరణగా అందించారు. అలాగే వార్షికోత్సం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, విశ్రాంతి ఉపాధ్యాయుడు యూఎస్ ప్రకాశ్‌రావు, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మాతృభాష దినోత్సవం

**చండ్రుగొండ:** మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు కవుల వేషాధారణలో పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలుగుభాష ఔనత్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు.

**అశ్వారావుపేటరూరల్:** మాతృభాషను మరవొద్దని, భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అశ్వారావుపేట జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.హరిత అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం, గుమ్మడవల్లి, అచ్యుతాపురం, కొత్త మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేటలోని ఉన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాతృభాష గురించి విద్యార్థులకు వివరించారు.వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమాల్లో భాషోపాధ్యాయులు జాన్ కాంతారావు, కె.బాలస్వామి, పుల్లయ్య, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

**లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో..**

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పద్య పఠన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్ బాబు, ఎండీ బషీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చండ్రుగొండ: జెడ్పీ పాఠశాలలో తెలుగు కవుల వేషధారణలో విద్యార్థులు



అశ్వారావుపేటరూరల్: సంప్రదాయ నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



భద్రాచలంటౌన్: 'లిటిల్ ఫ్లవర్స్'లో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎండి.బషీర్